విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 17 సెప్టెంబరు 2024 8 పేజీలు

దుర్వినియోగమైన నిధుల వసూళ్లు

- జి. యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడాలో రూ.67.52 లక్షలు దుర్వినియోగం
- తిరిగి వసూళ్లు
- బాధితులకు అధికారుల సమక్షంలో నేటి నుంచి చెల్లింపులు
- కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : బ్యాంక్ ఆఫ్ బరోడా, జి. యర్రంపాలెం బ్రాంచికి చెందిన వ్యాపార కరస్పాండెంట్ ముతాబత్తుల నానిబాబు ద్వారా కస్టమర్లకు చెందిన డిపాజిట్లు దుర్వినియోగమైనట్టు గుర్తించారు. ఈ మేరకు సదరు మొత్తాన్ని సంబంధిత ఖాతాదారులకు చెల్లింపులు జరపవలసినదిగా బ్యాంకు అధికారులను ఆదేశించామని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. సెప్టెంబరు 17 మంగళవారం జి. యర్రంపాలెం బ్రాంచిలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. సదరు రూ. 67.52 లక్షలను విజన్ ఇండియా టెక్ సర్వీసెస్ లిమిటెడ్ నుంచి వసూలు చేసి బాధిత కస్టమర్లకు మొత్తాలను రీయింబర్స్ చేయనున్నట్లు బ్యాంకు అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారని కలెక్టర్ తెలిపారు. స్వయం సహాయ సంఘాలకు చెందిన 64 ఖాతాలకు చెందిన మొత్తం రికవరీ చేసినట్టు తెలిపారు. గ్రామాల వారీగా గుర్తించిన వివరాలు పుణ్యక్షేత్రంకు చెందిన 15 ఖాతాలకు చెందిన రూ.26,69,000, కొండగుంటూరు పాకలకు చెందిన రెండు ఖాతాలకు రూ.81 వేలు, సంపత్ నగర్‌కు చెందిన ఆరు గ్రూపుల ఖాతాలకు రూ.5,45,000లు, జీ.యర్రంపాలెంకు చెందిన 41 ఖాతాలకు రూ.34,11,757 వెరసి రూ.64,06,757 దుర్వినియోగమైనట్లు గుర్తించినట్టు జిల్లా గ్రామీణాభివృద్ధి పథక సంచాలకులు ఎన్ వివి ఎస్ మూర్తి తెలిపారు.

ఇప్పటికే సంబంధిత సమాచారం ఖాతాదారులకు తెలియజేశామన్నారు. డీఆర్డీఏ సమక్షంలో సదరు చెల్లింపుల ప్రక్రియను సజావుగా బ్యాంకు బ్రాంచిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

వరద బాధితులకు అండగా ఆటోమొబైల్ వర్కర్స్

విశాలాంధ్ర-ఏలూరు: వరదల కారణంగా అనేక ఇబ్బందులు పడుతున్న విజయవాడ నగర ప్రజలను ఆదుకోవడానికి ఏలూరు ఆటోనగర్ సభ్యులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రూ.10వేల ఆర్థిక సహాయాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ద్వారా సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య,రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ కు అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించి వారిని ఆదుకోవడానికి ఆపన్న హస్తం అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందన్నారు.అటువంటి బాధ్యతను నిర్వర్తించి ప్రజల నుండి విరాళాల సేకరణ ద్వారా మొదటి దఫా రూ.15వేలను, సోమవారం రూ.10వేలను విరాళంగా అందించిన ఏలూరు ఏరియా సమితి వారికి, ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ వారికి, విరాళాల సేకరణలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు అరుణ తార నాగేశ్వరరావు, శాయన అభిలాష్ కుమార్,కొండేటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి స్వచ్ఛతాహి సేవా

కలెక్టర్ చదలవాడ నాగరాణి

విశాలాంధ్ర -భీమవరం: జిల్లాలో ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు నిర్వ హించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దేశ వ్యాప్తంగా మహాత్మాగాంధీ జయంతిని పురస్క రించుకొని ఈ నెల 17 నుండి అక్టోబర్ 1 వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు జరుగుతాయని, అక్టోబర్ 2న స్వచ్ఛ భారత్ దివాస్‌గా జరుపుకుంటామని తెలిపారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 17 న

ప్రారంభోత్సవం ఉంటుందని,18 నుండి అక్టోబర్ 1 వరకు పలు కార్యక్రమాలు నిర్వ హించనున్నట్టు తెలిపారు. స్వచ్ఛతాహి భగీదరిలో భాగంగా తల్లి పేరుతో ఒక మొక్కను నాటడం, ▶మిగతా 2లో

శ్రమిస్తేనే విజయాలు

'శ్రీ అగస్త్య' అవగాహన సదస్సులో జెఎన్‌టియుకె ఉపకులపతి

విశాలాంధ్ర - కాకినాడ : విద్యార్థి అటు తరగతి గదిలో గాని, ఇటు ఆయా పాఠ్యాంశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులు బోధించే అంశాలను ఆకళింపు చేసు కుని ఏకాగ్రతతో పరిశ్రమించి నపుడే ఉన్నత స్థాయికి చేరేందుకు మార్గం సుగమమవుతుందని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్ జి. మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎన్ఎఫ్‌సిఎల్ రోడ్డులోని జి-కన్వెన్షన్ హాలులో సోమవారం శ్రీ అగస్త్య విద్యాసంస్థల ▶మిగతా 2లో

ఎన్నికల వాగ్దానాలు 5 అమలు
ఎంపీ మహేష్ 8

మల్లికార్జునచార్యులు సేవలు ఆదర్శనీయం
కృష్ణచైతన్య 8

పాతాళకుంట వాగు మరమ్మతుపై ఎందుకింత నిర్లక్ష్యం?

అధికారులు, పాలకులు స్పందించరా?

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెం ఊరి మధ్యలో ఉన్న పాతాళకుంట వాగును మరమ్మత్తు చేయకపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ, ఇన్నీకావు.వర్షాలు పడే సమయంలో ఎగువ ప్రాంతంలో పడిన వర్షపు నీటిని ఉపయోగంలోకి తీసుకువచ్చేందుకు పాతాళకుంట వాగును అనేక ఏళ్ల క్రితం నిర్మించారు.

ఈ వాగు ద్వారా వచ్చే నీరు ఎర్ర చెరువులో కలిసి చెరువు నుంచి ఆయకట్టు భూములకు చేరతాయి. దాదాపు 5 దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ కాలువ ఒకప్పుడు ఎంతో ఉపయో గంగా ఉండేది. కిలోమీటరులోపు దూరంలో ఈ కాలువ 3,4,5వార్డుల మధ్య నుంచి నిర్మించారు. ఒకప్పుడు ఎంతో ఉపయోగంగా ఉన్న ఈ కాలువ ఇప్పుడు తీవ్రమైన దుస్థితిలో ఉంది.కాలువ స్వరూ పమే మారిపోయింది. అసలు ఇది కాలువేనా?అన్నట్లుగా ఉంది.వర్షం వచ్చినా

ఈ కాలువ ద్వారా నీటి సరఫరా జరగటం లేదు. కాలువంత పూడికపడింది. కాలువ సమీప ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వ్యర్థాలను, వినియో గించుకునే మురికి నీటిని కాలువలోకి మళ్లించడం వల్ల మురికి కూపంలా మారింది. కాలువ నుంచి తీవ్ర దుర్గంధం వస్తున్నది. దీనివల్ల అంటువ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దశాబ్దాల కాలంగా ఈ కాలువను పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. అధిక వర్షాలు పడ్డప్పుడు కాలువలో నీరు ప్రవహించక ఇళ్లను ముంచెత్తు తున్నాయి. ఈ కాలువకు ఇరువైపులా గోడ నిర్మించి కింది భాగంలో కాంక్రీట్ వేస్తే ఉపయోగంగా ఉంటుంది. ఇలా చేసేందుకు అనేకసార్లు అంచనాలు తయారు చేసి ఉన్నత అధికారులకు పంపారు.కానీ ఇప్పటివరకు ఎటువంటి అనుమతులు రాలేదు.ఇప్పటివరకు తాత్కాలికంగా పనులు చేస్తున్నారే గాని పర్మినెంట్ పనులు చేయకపోవడంపై ప్రజలు తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నారు. ఊరి మధ్యలో ఉన్న ఈ కాలువ ఎంతో ఉపయోగకరంగా ఉన్నప్పటికీ ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ఈ కాలువ దుస్థితిపై ఇప్పటికైనా ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని పక్కాగా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ -పంట నమోదుకు 25 వరకు గడువు

విశాలాంధ్ర - పాలకోడేరు: రైతులు ఈ- పంట నమోదు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25 వరకు గడువు పొడిగించినట్లు మండల వ్యవసాయ అధికారి వి. నారాయణరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ -పంట ముఖ్య ఉద్దేశం అతివృష్టి, అనావృష్టి సంభవించిన, నకిలీ విత్తనాలు, పండించిన పంటకు మద్దతు ధర తగ్గకపోవడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పెట్టుబడి సైతం చేతికిందక పోవడం ఇలాంటి పరిస్థితుల్లో రైతుకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. పండించిన పంటను విక్రయించాలన్నా తప్పనిసరిగా ప్రతి ఒక్క రైతు సోదరుడు తమ పంట సాగు వివరాలను యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం (యు డి పి) లో నమోదు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్క రైతు తమకు సంబంధించిన ఆధార్ కార్డ్, పట్టాదార్ పాస్ పుస్తకం, ఫోన్ నెంబర్, పంట వివరాలు సంబంధిత గ్రామాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు లేదా మండల వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని గాని నేరుగా సంప్రదించాలని కోరారు.

పామాయిల్‌కు మద్దతు ధరతో హర్షం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర రావడం సంతోషం అని పోలవరం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు పేర్కొన్నారు. మండలంలో బయ్యనగూడెం గ్రామంలో రామారావు ఇంటి వద్ద టిడిపి నాయకులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పామాయిల్ పంట గిట్టుబాటు ధర కోసం ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్ట మహేష్ యాదవ్ చేసిన కృషి మరువలేనిదని ఆయన తెలిపారు. ఎంపీ మహేష్ యాదవ్ అభ్యర్థన మేరకు, కేంద్ర ప్రభుత్వం వాణిజ్య పన్నుల శాఖ అధికారులను కలిసి, క్రూడ్ ఆయిల్ పై టాక్స్ ను 5.5 శాతం నుండి, 27.5 శాతం వరకు పెరిగేలాగా చేశారని, రైతులకు ఒక టన్ను కు రూ.1000 నుండి 1500 వరకు పెరిగే అవకాశం ఉందని, పామాయిల్ టన్నుకు సుమారు రూ. 16వేల 500 వరకు పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పారేపల్లి నరేష్, టేక్కెం సీతారాములు, పారేపల్లి సత్యనారాయణ, టిఎన్ఎస్ఎఫ్ అధికార ప్రతినిధి పవన్, పాల్గొన్నారు.

రూ. 1.75 లక్షలు పలికిన వినాయక లడ్డు

విశాలాంధ్ర -నూజివీడు: వినాయక నవరాత్రుల సందర్భంగా మండలంలోని పోతిరెడ్డిపల్లిలో రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డు రూ.1.75 లక్షల ధర పలికింది. సోమవారం నిర్వహించిన లడ్డు వేలం పాటలో పోతిరెడ్డిపల్లి గ్రామస్తులు అక్కినేని ఆంజనేయ ప్రసాద్, ప్రేమ్ కుమార్ మిత్ర బృందం లక్ష 75 వేలకు లడ్డును దక్కించుకున్నారు. వేలం పాటలో దక్కించుకున్న లడ్డుని రామాలయం నిర్వాహకులు అక్కినేని బెనర్జీ, పాటదారులకు అందజేశారు.

రవికుమార్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన కార్యదర్శి, మాజీ జెడ్పీటీసీ గడ్డమనుగు రవికుమార్‌ను సోమవారం ఆయన నివాసం వద్ద తెలంగాణ రాష్ట్రం అశ్వరావుపేట మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు కలిశారు. చిన్నప్పటినుండి ఎంతో స్నేహపూర్వకంగా ఉండేవారమని ఆప్యాయంగా కలిసి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల రాజకీయ అంశాలపై చర్చించారు. జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో చదివి నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే స్వస్థలం టీ నరసాపురం మండలం మద్రిగూడెం గ్రామం. తెలంగాణలో ఉన్న కానీ చిన్ననాటి స్నేహితులు గుర్తున్నారని తెలిపారు.

మద్యం నియంత్రించి నిత్యావసరాల ధరలు తగ్గించండి

మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సూర్యనారాయణ

విశాలాంధ్ర - పిఠాపురం : మద్యాన్ని నియంత్రించి నిత్యావసరవస్తుల ధరలు తగ్గించి వారి కుటుంబాలను ఆదుకోవాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఆదివారం ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్ అధికారులతో జరిగిన సమావేశంలో ప్రభుత్వం నూతన పాలసీ ద్వారా ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచుతామని చెప్పడం వెనుక ప్రజలందరినీ తాగుబోతులను చేయడమేనని అన్నారు. మద్యం కారణంగా నేరాలు రెట్టింపు అవుతున్నాయన్నారు. తాగేవాళ్ళ సంఖ్యను తగ్గించాల్సింది పోయి మద్యాన్ని ఆదాయ వనరుగా చూడడం బాధాకరమన్నారు. మద్యం పాలసీని రూపొందించడంలో ప్రభుత్వం లక్ష్యం ఏమిటి? మద్యాన్ని నియంత్రించడం, నేరాలను అరికట్టడం, ప్రజల ఆరోగ్యం మరీ ముఖ్యంగా మహిళలు, పిల్లల పై హింసను అరికట్టడం, అక్రమ అమ్మకాలు లేకుండా చేయడమా? లేక ఆదాయాన్ని పొందడమా? అని ప్రశ్నించారు.

ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి

గత ప్రభుత్వం అమ్మిన మద్యం బ్రాండ్ల వలన 30000 వేల మంది చనిపోయారని, మంచి నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు మరీ ముఖ్యంగా టీడీపీ ప్రచారం చేశాయన్నారు. నాణ్యమైన మద్యం ప్రజల ప్రాణాలు తీయదా? మహిళలపై హింసకు కారణం కాదా? నేరాలు పెరగకుండా నిరోధిస్తుందా? అని ప్రశ్నించారు. ఈ తాగుడు ప్రమాదం నుండి ప్రజలను రక్షించే మార్గం లేదా? తాగి ఇళ్లు, వళ్ళూ గుల్ల చేసుకోవడమే గాక కుటుంబంలో భార్యాబిడ్డల హింసకు, అత్యాచారాలకు కారణమవుతున్న మద్యాన్ని అరికట్టాల్సిన, నియంత్రించాల్సిన బాధ్యత ప్రజా క్షేమం కోసం పనిచేయాలనుకునే ప్రభుత్వానికి లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నా రన్నారు. ఇంకోవైపున ఉల్లి, నూనె, కూరగా యల ధరలతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. ధరలు తగ్గించాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ ఎన్. సూర్యనారాయణ డిమాండ్ చేశారు.

ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించండి

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సత్వరమే పారిశుధ్య నిర్వహణ పూర్తిచేసి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించాలని నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కండ్రిక, ఉడా కాలనీ, రాజీవ్ నగర్, నున్న, ముస్తాబాద్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాల కారణంగా అక్క డున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం దగ్గరే ఉండి వ్యర్థాలను తొలిగించేలా చర్యలు తీసుకోవా లని అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరావును ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడైతే పాఠశాలలు, ఆస్పత్రులు ఉంటాయో అక్కడ వెంటనే పారిశుధ్య నిర్వహణ సత్వరం పూర్తి చేసి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రమిస్తేనే విజయాలు

(1వ పేజీ తరువాయి)

ఆధ్వర్యంలో 'బికమింగ్ ఏ జీనియస్' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యవక్తగా పాల్గొనగా సంస్థ డైరెక్టర్ డివిఎన్ రావు సదస్సుకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొ. కెవివిఎస్‌జి మురళీకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమలో తమను ప్రశంసించుకున్నప్పుడే మనిషిలో ఒక ఆత్మవిశ్వాసం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను నిరంతరం ప్రోత్సహిస్తూ ఉత్సాహపరిచినపుడే వారిలో సానుకూల దృక్పథం ఏర్పడి భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ప్రపంచానికి పరిచయం అవుతారన్నారు. విజయానికి ముందు వినయం ఉంటుందని, పతనానికి ముందు పొగరు ఉంటుందని, వినయంతో ఉన్నవారు ముందుకు దూసుకువెళ్లారన్నారు. ప్రపంచానికి భారతదేశం విశ్వ గురువు అని, విదేశాలలోని విద్యార్థులకు సైతం అక్కడి ప్రభుత్వాలు భారతదేశానికి వచ్చేందుకు వీసా లేకుండా అనేక దేశాలు అనుమతులు ఇస్తున్నాయన్నారు. వేదాలు, ఉపనిషత్తుల సారాంశమే నేడు భారత యువతను విజ్ఞానగనిగా రూపొందించిందన్నారు. శ్రీ అగస్త్య మహాముని గొప్పతనాన్ని తెలిపి ఆ పేరుతో ఏర్పడిన శ్రీ అగస్త్య విద్యా సంస్థలు అనతికాలంలో సాధించిన విజయాలను ఆయన అభినందించారు.

అనంతరం ఐఐటి, ఎన్ఐటి, నీట్, ఏపి ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లు సాధించిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అగస్త్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, టీచింగ్ & నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతాహి సేవా

(1వ పేజీ తరువాయి)

మెప్మా, డ్వాక్రా, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో స్థానిక స్వచ్ఛతా కార్యక్రమాల పై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. విద్యుత్, నీటిఆదా, ప్లాస్టిక్ నిరోధం, తాగునీటిని క్లోరినేషన్ చేయడం, ఆరోగ్యకరమైన జీవితం, తదితర అంశాల పై అవగాహన కల్పించనున్నామన్నారు. విద్యా ర్థులు తయారు చేసిన వస్తువులను గాంధీ జయంతి రోజున ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి ఆకర్షణీయమైన వస్తువులను తయారు చేసినవారికి నగదు బహుమతులు అందిస్తామ న్నారు. అక్టోబర్ 2వ తేదీన స్వచ్ఛ భారత్ దివాస్ ఉత్సవంతో కార్యక్రమాలు ముగుస్తా యని, ఈకార్యక్రమాలను ప్రణాళిక ప్రకా రంగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు.

నేడు ,రేపు జిల్లా వ్యాప్తంగా స్కూల్ కాంప్లెక్స్‌ల నిర్వహణ

విశాలాంధ్ర -ఏలూరు: జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మంగళ, బుధవారాలలో స్కూల్ కాంప్లెక్స్ లు జరుగనున్నాయి. మంగళవారం తెలుగు ,మ్యాథ్స్, బయోలాజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్లకు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు జరుగుతాయి. ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు 50% మంది మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ హాజరు కావాల్సి ఉంటుంది.బుధవారం హిందీ ,ఇంగ్లీషు ,పిఎస్ ,సోషల్ స్కూల్ అసిస్టెంట్లకు, ప్రాథమిక పాఠశాలలో 50 శాతం మంది ఉపాధ్యాయులకు స్కూల్ కాంప్లెక్స్‌లు ఉంటాయి. ప్రతి కాంప్లెక్స్ కు ముగ్గురు సీనియర్ టీచర్లు రిసోర్స్ పర్సన్ లుగా వ్యవహరిస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే స్కూల్ కాంప్లెక్స్‌లో చర్చించిన అన్ని బోధన అంశాలను రిజిస్టర్లలో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆయా తేదీల్లో పేర్కొన్న విధంగా స్కూల్ అసిస్టెంట్లు అందరూ తప్పనిసరిగా స్కూల్ కాంప్లెక్స్ హాజరుకావాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. డివై ఈవో లు, ఎం ఈ ఓ లు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్ఎంలు స్కూల్ కాంప్లెక్సును పర్యవేక్షించి వివరాలను గూగుల్ ఫారం లో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ . అబ్రహం కోరారు. స్కూల్ కాంప్లెక్స్ లో గత నెలలో పూర్తిచేసిన విద్యా సంబంధ కార్యక్రమాలపై చర్చ, ప్రస్తుతం నెలలో విద్యార్థులకు అమలు చేయాల్సిన విద్య కార్యక్రమాలు, మోడల్ లెసన్ ప్లాన్, నమూనా పాఠ్యాంశం బోధన, పరీక్షల నిర్వహణ ,మార్కులను అప్లోడ్ చేయడం తదితర అంశాలను స్కూల్ కాంప్లెక్స్ లో చర్చించాలని ఉపాధ్యాయులను డిఇఓ కోరారు.

పోలవరంలో మీలాద్ ఉన్ నబీ

విశాలాంధ్ర-పోలవరం: పోలవరం గ్రామంలో, అహల్ సున్నత్ జమాత్ మసీద్ కమిటీ అధ్యక్షుడు యాసిన్ షరీఫ్ ఆధ్వర్యంలో సోమవారం ముస్లిం సోదరులు మీలాద్ ఉన్ నబీ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేసి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని అల్లాను ప్రార్థించారు. మొహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామంలో జండాలతో భారీ ర్యాలీ నిర్వహించి, ఒకరికి ఒకరు మీలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సందాని, కోశాధికారి షేక్ సలీం, మహమ్మద్ బాషా, జిలాని భారీగా ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చండి

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీ గూడెం లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో ప్రధాన రహదారిపై పెద్ద గొయ్యి పడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా ఉంది.ఇటీవల కురిసిన వర్షాలకు ఈ ప్రాంతంలో రోడ్డు దెబ్బతింది. గ్రామంలోని మసీదు సమీపంలో ఉన్న ప్రధాన రహదారి మరమ్మతుకు గురైంది. ఈ ప్రాంతంలో కూడా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.పగటిపూట ఈ మార్గంలో వెళ్లటానికి నరకయాతన పడుతున్నారు.రాత్రి సమయంలో ప్రయాణికులు పడే ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ మార్గంలో పడిన గోతులను పూడ్చి రాకపోకలకు అంతరాయం లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. తాత్కాలికంగా నైనా గోతులను పూడిపించి రాకపోకలకు ఇబ్బంది కలగకుండా చేయాలని ప్రతి ఒక్కరు కోరుతున్నారు.

కంపోస్టు యార్డు ఏర్పాటుపై ప్రజామోద నిర్ణయం

గ్రామస్తులతో చర్చించిన ఎమ్మెల్యే నాయకర్

విశాలాంధ్ర-నరసాపురం : నర్సాపురం మండలం, రస్తుంబాద గ్రామం, మండావారి గరువులో కంపోస్టుయార్డ్ ఏర్పాటుపై ప్రజామోద నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. సోమవారం ఆయన ప్రతిపాదించిన స్థలమును పరిశీలించి గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కంపోస్ట్ యార్డ్‌ను తమ గ్రామంలో ఏర్పాటు చేస్తే ఏర్పడే ఇబ్బందులను, సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామస్థులతో నాయకర్ మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందవద్దని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని,ఈ సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళతానని అన్నారు. ప్రజలందరి సహకారంతో ప్రజలందరికీ ఆమోద యోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఏమైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని హితవు పలికారు. ఏ కార్యక్రమం చేపట్టినా నియోజకవర్గ అభివృద్ధి కోసమే చేపడతామని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బందెల భారతి, రవీంద్ర, వలవల నాని, ఆకన చంద్రశేఖర్, పులి భుజంగరావు, వాతాడి కనకరాజు, వట్టిప్రోలు సతీష్, గన్నాబత్తుల దుర్గాప్రసాద్, గ్రంధి నాని, కందులపాటి బాలాజీ, మండావారి గరువు గ్రామస్థులు , జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

పోలీసు వెల్ఫేర్ పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఎస్పీ శంకుస్థాపన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణలో ప్రజలకు నాణ్యమైన పెట్రోలు, డీజిల్ అందజేసేందుకు ఏలూరు నగరంలో భారత్ పెట్రోల్ బంక్ ను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ స్పష్టం చేశారు. సోమవారం ఏలూరు నగరంలోని అమీనా పేట ప్రాంతంలోని పోలీస్ కళ్యాణ మండపం

పక్కనే ఉన్న స్థలంలో భారత్ పెట్రోల్ బంక్ నిర్మాణానికి ఎస్పీ భూమి పూజ, శంకుస్థాపన చేసి పనులు ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా ఈ బంక్ నిర్మాణానికి చేపట్టే నిర్మాణ లేఔట్‌ను ఎస్పీ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏలూరు ప్రజానీకానికి స్వచ్ఛమైన, సరైన కొలతలు, ప్రామాణికత కలిగిన పెట్రోల్, డీజిల్ ను అందించడం కోసం పోలీస్ వెల్ఫేర్ పెట్రోల్ బంకును స్థాపిస్తున్నట్లు వివరించారు. సాధ్యమైనంత త్వరితగతిన ఈ బంకును ప్రజలకు అందుబాటులోకి వినియోగం కోసం తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు ఎస్పీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ ఎస్.శేఖర్, ఏలూరు డిఎస్పీ డి.శ్రావణ్ కుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీహరి రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : మతపరమైన పండుగల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టినట్లు ఏలూరు నగర సిఐలు స్పష్టం చేశారు. వినాయక చవితి ఉత్సవాలు 11వ రోజు ముగింపు సందర్భంగా విగ్నేశ్వరుని నిమజ్జనం

కార్యక్రమం, మిలాద్ ఉన్ నబి పండుగలు రెండు కలిపి సోమవారం రావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ఏలూరు నగరంలో పోలీస్ శాఖ భారీ బందోబస్తు నడుమ భద్రత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఏలూరు జిల్లా ఎస్పీ కె.శివకిషోర్ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏలూరు వన్ టౌన్ సిఐ సత్యనారాయణ, టూ టౌన్ సీఐ రమణ, త్రీ టౌన్ సిఐ కోటేశ్వరరావు, సిసిఎస్ సిఐ మురళీకృష్ణల స్వీయ పర్యవేక్షణలో ఎస్సైలు, సిబ్బంది నగరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రధాన కూడళ్ళు, ప్రాంతాల్లో బందోబస్తు నిర్వహించారు. భారీ విగ్రహాలు ఊరేగింపు జరుగుతున్న నేపథ్యంలో ఆ ఊరేగింపుకు సైతం భారీగా పోలీసు భద్రత నడుమ నిమజ్జన కార్యక్రమాలను ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి చేశారు.

వరద బాధితులకు సేవలు

విశాలాంధ్ర-లింగపాలెం: విజయవాడలోని వరద బాధితులకు మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, వివిధ రంగాలలో పనిచేస్తున్న వ్యాపారులు,సాఫ్ట్ వేర్ ఉద్యోగులు, తమ వంతు సహకారం అందించారు. నూనె,బియ్యం,పంచదార,గోధుమపిండి, సబ్బులు తదితర నిత్యవసర సరుకులను బాధితులకు అందించారు. 500 మందికి వీటిని వీరు అందజేశారు. సేవలు అందించిన వారిలో మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సందీప్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మూర్తి, వంశీ, బ్యాడ్మింటన్ టీం సభ్యులు,విశ్రాంతి మిలటరీ ఉద్యోగి అసిఫ్, మైక్రో ఆర్టిస్ట్ మేత్రా సురేష్, రియల్ ఎస్టేట్ వ్యాపారి రాజేశ్వరి తదితరులు ఉన్నారు.వరద బాధితులకు తమ వంతుగా స్వచ్ఛందంగా సేవలు అందించినట్లు వీరు పేర్కొన్నారు.

ఓజోన్ పరిరక్షణ మనందరి బాధ్యత

మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: ఓజోన్ పొర పరిరక్షణ ప్రపంచంలో అందరి బాధ్యతని, జీవరాశికి రక్షణ కవచం ఓజోన్ పొరని మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. కమిషనర్ రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ సూర్యుని నుంచి వెలువడే కిరణాలు నేరుగా భూమిపై పడకుండా అందులో ఉండే అతినీలలోహిత కిరణాలను ఓజోన్ పొర సంగ్రహించి, ప్రాణకోటికి వాటిల్లే ముప్పు నుంచి కాపాడు తుందన్నారు. ఏంఈవో వేంద్ర వెంకటరావు, శ్రీనివాస్, నిర్వాహకులు చెరుకువాడ రంగ సాయి మాట్లాడుతూ మోటారు వాహనాలు పెరగడం, పరిశ్రమల కాలుష్యం, అధిక శాతం మంది ఏసీలను వినియోగించడం వలన ఓజోన్ పొర క్షీణించిపోతోందని

అన్నారు. అడవుల నరికివేతను పూర్తిగా నిలిపి వేయాలని, మొక్కలను పెంచాలని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్ర మంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, ఆదినారాయణ, చంటి, మున్సిపల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

అభిమానమే హద్దు... చట్టం వద్దు...

విశాలాంధ్ర-ఏలూరు: తమకు ఇష్టమైన నాయకుని పై ఉన్న అభిమానాన్ని చాటుకునేందుకు కొందరు నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. ఏదైనా క్రిమినల్ యాక్టివిటీ లేదా ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన సందర్భంలో వాహనాన్ని ,దాని యజమానిని గుర్తించడానికి చట్టాన్ని అమలు చేసే అధికారులకు మోటారు వాహనాలకు అమర్చే నెంబర్ ప్లేట్ సహాయపడుతుంది.

కొందరు మోటర్ వెహికల్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. తమ నాయకుని పేరును, పార్టీల గుర్తులను నెంబర్ ప్లేట్ స్థానంలో అమర్చి, దర్జాగా తిరుగుతూ అభిమానాన్ని చాటుకుంటు న్నారు. ట్రాఫిక్ పోలీసులు ఇటువంటి వారిపై దృష్టిని సారించాల్సి ఉందని పలువురు అంటున్నారు.

చికెన్ వేస్ట్ వాహనం స్వాధీనం

విశాలాంధ్ర-భీమడోలు: సోమవారం భీమడోలు ఎస్.ఐ.సుధాకర్‌కు అందిన సమాచారం మేరకు విజయవాడ నుంచి బొలేరా వ్యాన్లో చికెన్ వేస్ట్ అంబర్ పేట గ్రామానికి చెందిన వినయ్ అనే వ్యక్తి చెరువు మీద చల్లుతుండగా ఎస్.ఐ. సుధాకర్ దాడి చేసి పట్టుకొని వాన్ సీజ్ చేసి చికెన్ వేస్ట్ ను భూమిలో పూడ్చి పెట్టారు. బలే సుబ్బరాజు అనే వ్యక్తి విజయవాడ నుంచి కొనుగోలు చేసి అక్రమంగా చేపల చెరువులకు తరలిస్తున్నాడని,దీనిపై ఎస్ఐ సంబంధిత

వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినైనా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్.ఐ. సుధాకర్ హెచ్చరించారు.

చరిత్రలో నిలిచిన అధిక వర్షపాతం

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం మండలంలో జూన్, జూలై,ఆగస్టు, సెప్టెంబర్ లో ఇప్పటివరకు కురిసిన వర్షం 50 ఏళ్ళ కాలంలో పడ లేదని అధికారులు అంటు న్నారు. ప్రతి ఏడాది మే నుంచి డిసెంబర్ వరకు1098మీ.మీ వర్షం పడాల్సి ఉండగా ఇప్పటికే1488మీ.మీ వర్షం పడింది.జూన్ లో 118మీ.మీ వర్షం పడాల్సి ఉండగా236మీ.మీ, జూలైలో 254 మీ.మీ వర్షం పడాల్సి ఉండగా575మీ.మీ, ఆగస్టులో239మీ.మీ వర్షం పడాల్సి ఉండగా385మీ.మీ, సెప్టెంబర్ లో 178మీ.మీ వర్షం పడాల్సి ఉండగా ఇప్పటికీ292మీ.మీ వర్షం పడింది.అధిక వర్షం మండలంలో పడటం వల్ల భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది ఖరీఫ్,రబీలో సాగు నీటి ఎద్దడి ఉండదని అధికారులు అంటున్నారు. రబీలో వేసే పంటలకు, ఉద్యాన పంటలకు వర్షం వల్లఅధిక ప్రయోజనం కలిగిందని అధికారులు అంటున్నారు.

శారీరక సౌష్టవంతోనే సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : శారీరక సౌష్టవంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభించడంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడం సాధ్యపడుతుందని ఏలూరు సిసిఎస్ సిఐ సిహెచ్. మురళీకృష్ణ అన్నారు. ఏలూరు లోని సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో జరిగిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలకు సిఐ మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ శారీరక దృఢత్వం పొందడానికి వ్యాయామాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. శారీరకంగా దృడత్వంగా ఉంటే ఆరోగ్య వంతులుగా జీవించవచ్చని సూచించారు. ప్రస్తుత సామాజిక జీవన పరిస్థితులను బట్టి ప్రతి ఒక్కరు ఆరోగ్యవంతులుగా జీవించడానికి వ్యాయామాలు చేయాల్సిన అవసరం ఎంత ఉందన్నారు. ఈ బాల్డింగ్ బిల్డింగ్ పోటీలు ప్రతి ఏడాది నిర్వహిస్తూ యువతను ప్రోత్సహించడం పట్ల నిర్వాహకులను సిఐ అభినందించారు. బాడీ బిల్డింగ్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు సీఐ మురళీకృష్ణ బహుమతి ప్రదానం చేశారు.

చీటింగ్ కేసు నమోదు

విశాలాంధ్ర- పాలకోడేరు: పాలకోడేరు మండలం వేంద్ర గ్రామానికి చెందిన చీర వెంకటరమణ అనే మహిళ అధిక వడ్డీలకు ఆశ చూపి ప్రజల దగ్గర నుంచి సుమారుగా కొన్ని లక్షల రూపాయలను చీటీల రూపంలో కట్టించుకుంది. గడువు తీరినా తిరిగి వారికి ఇవ్వకపోవడంతో వారు ఆమెను గట్టిగా నిలదీయడంతో సరైన సమాధానం చెప్పకపోవడం వల్ల సంబంధిత బాధితులు పాలకోడేరు పోలీసులను ఆశ్రయించారు. పాలకోడేరు ఎస్సై ఎన్.హరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

విశాలాంధ్ర-పెదవేగి: దెందులూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను పలువురు కూటమి నాయకులు, అధికారులు, ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దృష్టికి తీసుకురాగా సత్వరమే వాటిని పరిష్కరించేలా సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇటీవల వంద రోజులు పూర్తి చేసుకుందని, గత 5 ఏళ్ళ వైసీపీ పాలనలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన ఎన్నో గ్రామ సమస్యలను ఈ వంద రోజుల్లో పరిష్కరించి ప్రజలకు అండగా నిలిచామని తెలిపారు. ఈకార్యక్ర మంలో మండల పార్టీల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లు బాబు),లావేటి శ్రీనివాస్, బొప్పన సుధా, నంబూరి నాగరాజు, పార్టీ నాయకులు తాతా సత్యనారాయణ సహా పలువురు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఫ్యాన్ల వితరణ

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న కంప్యూటర్ ల్యాబ్‌కు కళాశాల సీపీడీసీ సభ్యులు ఎల్ .వెంకటేశ్వరరావు జన్మదిన సందర్భంగా 5 సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు ఈ సందర్భంగా దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది,హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు పివి రమణ, క్లబ్ మాజీ అధ్యక్షులు కేబి రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-కంచికచర్ల : పట్టణ శి వారు పరిటాల గ్రామ సమీపంలో సోమ వారం బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో కంచికచర్లకి చెందిన ఉప్పుతల్ల తిరుపతిరాజుకు తీవ్ర గాయాల య్యాయి. సమాచారాన్ని అందుకున్న కంచికచర్ల ఎస్ఐ బి రాజు, స్థానికులు 108కి సమాచారం అందించడంతో 108 వాహనంలో చికిత్స నిమిత్తం విజయవాడ ట్రస్ట్ హాస్పటల్‌కు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి రాజు తెలిపారు.

ముంపు ప్రాంతాలు ఎమ్మెల్యే పరిశీలన

విశాలాంధ్ర-పెదపారుపూడి : భారీ వర్షాలు, వరదలతో ముం పు కు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోమవారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు నాయకులు గుండపనేని శ్రీనివాసరావు స్వామి సజ్జ శివకుమార్, దానబోయిన వెంకటనారాయణ, దూళ్ల జిమ్మీబాబు, నాగదేశి సునీత, వీఆర్వో ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం

అధికారుల అలసత్వం

విశాలాంధ్ర -భీమవరం టౌన్: తమ ఇంటికి సమీపంలోనే అమ్మవారి ఆలయాన్ని పంచాయతీ చెరువుగట్టుపై అనుమతులు లేకుండా నిర్మించడంపై సుబ్రహ్మణ్యేశ్వర రావు, మణిరత్నమాల దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం భీమవరంలో వారు విలేకరులతో మాట్లాడుతూ గుట్లపాడులో చెరువు గట్టుపై ఎటువంటి అనుమతులు లేకుండా ఆలయ నిర్మాణం చేపట్టడంపై సుబ్రహ్మణ్యేశ్వరరావు దంపతులు నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తూనే ఉన్నామన్నారు. ఈ ఆలయ నిర్మాణం పై రెండు వారాల క్రితం పలువురు గ్రామస్తులతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్, డీపీవో విక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

జిల్లా కలెక్టర్ నాగరాణిని కలిసి సమస్యను వివరించి, విన్న వించామన్నారు. అనుమతి లేకుండా ఆలయం నిర్మించడంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలు ఇచ్చినా దిగువ స్థాయి అధికారులు కనీసం పట్టించుకోవడంలేదన్నారు. ఆలయ ప్రాంతంలో పంచాయతీ అధికారి ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు ఉన్నా ఆలయం నిర్మాణం పనులు చేపట్టడం, రాత్రికి రాత్రికి, ఆలయంలో విగ్రహాలు పెట్టే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. స్థానిక, మండల స్థాయి

అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని తిరిగి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు.

ఆలయ నిర్మాణంపై హైకోర్టులో పిటిషన్ వేశామని, కోర్టులో కేసు విచారణలో ఉందన్నారు. ఆలయ నిర్మాణం పనుల్లో భాగంగా పంచాయతీ చెరువుగట్టుపై ఉన్న 100 ఏళ్ల నాటి భారీ వృక్షాన్ని కూడా ఎటువంటి అనుమతులు లేకుండా తొలగించారన్నారు. వీటన్నింటిపై నాలుగు నెలలుగా అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా బాధ్యులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని వారన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేకుండా నిర్మిస్తున్న నిర్మాణంపై సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సుబ్రహ్మణ్యేశ్వర రావు మణిరత్నమాల దంపతులు కోరుతున్నారు.

వరద బాధితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ: సీపీఐ 59 వ డివిజన్ ఆధ్వర్యంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు కేవీ.భాస్కర్ రావు పర్యవేక్షణలో అక్షయపాత్ర సౌజన్యంతో సోమవారం 1200 మందికి భోజన పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని సీపీఐ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు ప్రారంభించి గత 8 రోజుల నుండి వరద బాధితులకు ఆకలి తీరుస్తున్న సీపీఐ శ్రేణులను అభినందించారు. ప్రజానాయకులు పత్తా లేరున్నారన్నారు. నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం ప్రకటించి అందించాలని కోరారు. సహాయ కార్యదర్శి లంక దుర్గారావు మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు దాతలు ముందుకు వస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. ఈ

కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య స్థానిక నాయకులు కంది ఆదినారాయణ, ఎల్ శివకుమార్, ఎం.గురునాథం, రఫీ ,ఎస్ చిన్నా, పి.నాగరాజు, ఉమామహేశ్వరరావు, సత్యవతి పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎస్టీయూ సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి మండలం ఆముదార్లంకలో వరద బాధితులకు ఎస్టీయూ రాష్ట్ర నాయకులు కొమ్ము ప్రసాద్ మిత్ర బృందం, కృష్ణాజిల్లా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రూ. లక్ష వ్యయంతో 100 మంది బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, టవల్స్ అందచేశారు. యు.టైటస్పల్, పచ్చిగళ్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, ఎమ్మార్పీఎస్ నేతలు కొల్లూరి బసవ, కొక్కిలిగడ్డ నవీన్, పసుమర్తి దినేష్, కొల్లూరి దినేష్ గ్రామపెద్దలు పాల్గొన్నారు.

గుప్తాకు కళాసేవా తపస్వి బిరుదు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మికవేత్త, వేముల చారిటీస్ అధ్యక్షుడు డాక్టర్ వేముల హజరత్త య్య గుప్తకు కళా సేవా తపస్వి పురస్కారం ప్రదానం జరిగింది. సోమవారం ఎంబివికె భవన్‌లో కళాసౌరభ వారి జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం చేశారు. గుప్తకు సంస్థ 'నృత్యకిషోర్' పురస్కారాన్ని ప్రదానం చేసింది. వేదిక పై ఆసీనులైన నాట్య ఆచార్యులు పసుమర్తి శ్రీవల్లి, రాయన శ్రీనివాసరావు, ఎ. సంతోష్, ఎం. ప్రణతి,అన్నంబొట్ల శోభ తరపున హర్షిణీలు, మరో 22 మందికి నాట్య కిషోర్ అవార్డు ప్రదానం జరిగింది. కార్యక్రమాన్ని నాట్య ఆచార్యులు ఖరీముల్లా , సాయి నిర్వహించగా ప్రారంభంలో చిన్నారులు ప్రదర్శించిన వివిధ నృత్యాంశాలు ప్రేక్షకుల మన్ననలను చూరగొన్నాయి.

సంజీవిని వైద్యాలయానికి ఏసీ వితరణ

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం బార్లపూడి మాజీ సర్పంచ్, సిలికాన్ ఆంధ్ర సంజీవిని వైద్యాలయం సలహా మండలి మాజీ సభ్యులు కోనేరు రాజేంద్రప్ర సాద్ (బుల్లిబాబు) జ్ఞాపకార్థం ఆయన కుమారులు కోనేరు శ్రీనివాస్ (అమెరికా), కోనేరు లక్ష్మణ (బార్లపూడి) సోమవారం రవి

ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని సాయి ఆరోగ్య వైద్యాలయం కు 42 వేల రూపాయల విలువగలఏసీ మిషన్ అందజేశారు. ఆ కుటుంబ సభ్యుల తరపున కోనేరు లక్ష్మణ- రాణి దంపతులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జొన్నలగడ్డ హనుమకుమార్. కు అందజేయగావారిని వైద్యాలయ కుటుంబ సభ్యులు అభినందించారు.

వరద బాధితులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-విజయవాడ వన్ టౌన్ : ఎవ్వరూ ఊహించిన విపత్తులు సంభవించినప్పుడు ప్రభుత్వంతోపాటు తోటి సంఘీ యులు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి ఆదుకోవా ల్సిన అవసరం ఉందని సీనియర్ రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం. రవీంద్రనాథ్ బాబు పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక చిట్టి నగర్ లోని శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో సోమవారం ఉదయం ఏ పి ఎన్ బి సంక్షేమ సంఘం, న్యూస్ సంస్థల ఆధ్వర్యంలో వరదలలో నష్టపో యిన పేద మహిళలకు తుమ్మిడి సంస్థ దాదాపు రూ.లక్ష విలువైన చీరలను

పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఇప్పటివరకు వరద బాధితులకు న్యూస్ (నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్)తో వరద లలో నష్టపోయిన నాయి బ్రాహ్మణ పేదలకు దాదాపు రూ.4 లక్షల నిత్యవ సరాలు, వస్త్రాలు బహుకరించి నట్లు తెలిపారు. వస్త్రాలు బహుకరించిన తుమ్మిడి సంస్థల యజమాని తుమ్మిడి శ్రీనివాస్, తెలుగు తోరణం పత్రిక సంపాదకులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సహకారం వరదలలో సర్వం కోల్పోయిన వారికి అవకాశం ఉన్న ప్రతి వారు సహాయమందించాలన్నారు. ఈ కార్యక్ర మంలో ఏపీఎన్బి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లాపురం కనకారావు, రాష్ట్ర సంక్షేమ సంఘం నాయకులు కొమ్మవరపు భాను ప్రసాద్, కుటుంబ సంక్షేమ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఎం.రామ నాథం తదితరులు పాల్గొన్నారు.

షెడ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - పెదపూడి : పెదపూడి మండలం పెద్దాడ జడ్పీ హైస్కూల్లో నిర్మించిన సైకిల్, బస్టాండ్‌షెడ్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు. సోమవారం కుమారప్రియం సొసైటీ ఆర్థిక సహకారం రూ. 3.80 లక్షలతో నిర్మించిన సైకిల్ షెడ్, బస్టాండ్ షెడ్ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, రాజానగరం టిడిపి ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు బియ్యం పంపిణీ

విశాలాంధ్ర – దేవరపల్లి: గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం ఎర్నగూడెం గ్రామం నుండి వరద బాధితుల కోసం బియ్యం సహాయం చేయాలన్నా ఉద్దేశంతో జనసేన పార్టీ ఇంచార్జ్ దొడ్డిగర్ల సువర్ణ రాజు పిలుపుమేరకు సేకరించిన బియ్యాన్ని దేవరపల్లి కార్యాలయంలో సువర్ణ రాజు కాట్నం గణేష్ ఆధ్వర్యంలో సోమవారం 1000 కేజీలు బియ్యాన్ని అందజేశారు. యాదవోలు గ్రామం నుండి అనిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో 2200 కేజీలు, గౌరీపట్నం గ్రామం నుండి ఆ గ్రామ అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో 1000 కేజీలు, దేవరపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో సువర్ణరాజు అందజేశారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళాలు

విశాలాంధ్ర - ముమ్మిడివరం, ఐ పోలవరం : నిత్య కల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి సోమవారం భక్తులు విరాళాలు అందించారు. కాకినాడకు చెందిన మూసిరెడ్డి జగన్నాథబాబు దంపతులు పదివేల పదకొండు (10011), అనపర్తి గ్రామానికి చెందిన పోతంశెట్టి కృష్ణరెడ్డి దంపతులు పది వేలు (10000) శ్రీ వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కి విరాళం అందించారు. ఈ సందర్భంగా దాతలకు స్వామి చిత్రపటం, శేష వస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం అందించారు. ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి లక్ష్మీ నారాయణ అభినందించారు.

ఆదిత్య యూనివర్సిటీలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర – గండేపల్లి : గండేపల్లి మండలం సూరం పాలెం ఆదిత్య యూనివర్సిటీ లోని ఆధ్యాత్మిక ప్రాంగణంలో ని మసీదులో మహమ్మద్ ప్రవక్త జన్మదినం "మిలాద్ – ఉన్ – నబీ" సందర్భంగా ముస్లిం విద్యార్థులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డా సతీష్ రెడ్డి మాట్లాడుతూ ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం అల్లాహ్ ప్రపంచ శాంతి కోరుతూ చివరి ప్రవక్తగా మహమ్మద్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ అబ్దుల్లా, మొహమ్మద్ మొహసిన్, మొహమ్మద్ సయీద్, మహమ్మద్ జకారియా, ముస్లిం విద్యార్థులు పాల్గొని ప్రార్థనలు నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు.

నవసమాజ స్థాపనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఏపీపీయూఎస్ఎంఏ నూతన కార్యవర్గం ఎంపిక
- ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ

విశాలాంధ్ర - రాజానగరం : నవసమాజ స్థాపనకి ఉపాధ్యాయులు పాత్ర ఎంతో కీలకమని నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ అన్నారు. మండలం లోని సంపత్ నగరంలోని రాజమహేంద్రి విద్యాసంస్థల్లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ (ఏపీపీయుఎస్ఎంఏ) తూర్పుగోదావరి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తొలుత నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకంక్షలు చెప్పారు. దీనిలో భాగంగా పలువురికి మెమెంటోలు అందజేసి, శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవసమాజ స్థాపనకు విద్యాసంస్థలు, ఉపాధ్యాయుల కృషి అభినందనీయమన్నారు. నూతన కార్యవర్గం నియామకమైన ప్రతిఒక్కరు నిబద్ధతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు అభ్యుదయం కోసం ప్రభుత్వం పరంగా ఎటువంటి సహాయ సహకా రాలు కావల్సిన ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. నూతనంగా ఎన్నికైన ఏపీపీయు ఎస్ఎంఏ జిల్లా అధ్యక్షులు పి.కళ్యాణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రాజు, కోశాధికారి పి.సురేష్ ,గౌరవ అధ్యక్షులు భాస్కర రామయ్య, ఉపాధ్యక్షులు ఏ.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి వి.వి.వి.ఎస్.ఎన్. మూర్తి, ఈసి సభ్యులు పద్మ రాజు, పి.చక్రధర్, సభ్యులను పలువురు అభినందించి శుభాకంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలం జనవాణి ఇంచార్జ్ అరిగెల రామకృష్ణ,నాయకులు జగతా వీరభద్ర రావు,పెంటగట్ల రాజబాబు, కొత్తపల్లి రఘు,రాజమండ్రి పార్లమెంటరీ బీజెపి ఐటి కో-ఆర్డినేటర్ తొట్ట విజయ భాస్కర్,అగర్తి రజనీకాంత్,నంద్యాల కాశీక్రిష్ణ, బుడ్డిగ ప్రసాదరావు, కొండగుంటూరు గ్రామ టీడీపీ అధ్యక్షులు పెమ్మన బోయిన కోటేశ్వర రామకృష్ణ, గిరిజాల సుబ్రహ్మణ్యం, సంపత్ నగరం టిడిపి అధ్యక్షులు కోనే చిన బాబు, సమర్తకుర్తి మణి, బోయిడి వెంకటేష్, అడపా శ్రీను, యర్రంశెట్టి పోలరావు, జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

విశాలాంధ్ర – దేవరపల్లి : యువత రాజకీయ వ్యాపార రంగంలో ప్రవేశించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పేర్కొన్నారు . దేవరపల్లిలో సోమవారం సాయంత్రం ప్రణవ్ డిజిటల్ ఫ్లెక్సీ షాపును ఆయన ప్రారంభం చేశారు . ఈ సందర్భంగా వెంకటరాజు మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో ప్రవేశించి జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని అన్నారు. ప్రతి రంగంలో నైపుణ్యం సంపాదించుకుని అందరికీ సహాయ పడాలన్నారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీ షాపు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించగా క్యాష్ కౌంటర్‌ను తెలుగుదేశం సీనియర్ నాయకుడు కొయ్యలమూడి చినబాబు ప్రారంభించారు . ఈ కార్యక్రమంలో దేవరపల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కొయ్యలమూడి సుధారాణి, దుద్దుకూరు మాజీ సర్పంచ్ కె సౌదామని, తెలుగుదేశం నేతలు సుంకర దుర్గారావు , కరుటూరి శ్రీనివాస్, కంటిపూడి సుబ్బారావు, ముళ్ళపూడి దొరాజి చౌదరి, మేడిని సుధాకర్, అనిశెట్టి ప్రభాకరరావు, గద్దె సుబ్రహ్మణ్యం, ఉప్పులూరి సంభా, సూర్య చంద్రం,కొర్లపాటి సుబ్రహ్మణ్యం, బొల్లిన శ్రీధర్, పిన్నమనే నవీన్ , కడియం సూర్యనారాయణ, తంగెళ్ళ నిమ్మగడ్డ సతీష్ కులుకులూరి, హేమలత, జనసేన నేతలు కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

ఆదిత్యలో అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగం ప్రొఫెసర్ డా బివివి ఎస్ భీమేశ్వర రెడ్డి, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత యూనివర్సిటీ మీడియా మేనేజర్ తోటకూర గంగాధర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ పున్నం నాగేశ్వరావు, నెక్కంటి రామ్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా భీమేష్ రెడ్డి, గంగాధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబరు 16న ప్రపంచ వ్యాప్తంగా అంతర్జాతీయ ఓజోన్ దినోత్సవం నిర్వహిస్తారని జీవరాశికి రక్షణ కవచంగా ఉన్న ఓజోన్ పొరకు ఏర్పడిన రంధ్రం కారణంగా కలిగే నష్టాల గురించి ప్రజల్లో అవగా హన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఈ దినోత్సవాన్ని ఏర్పాటు చేసిందని తెలిపారు.

కూటమి ప్రభుత్వ నిర్వాకంతో వైద్య విద్యార్థులకు శాపంగా మారిన నీట్

విశాలాంధ్ర – అనపర్తి : అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చి ఆతర్వాత నిస్సిగ్గుగా ఆ హామీలు తుంగలో తొక్కి తాము అనుకున్నదే చేయడం టీడీపీకి ఆనవాయితీ అని, రాష్ట్రంలో నూతన ప్రభుత్వ మెడికల్ కాలేజీల విషయంలో టీడీపీ కూటమి ప్రభుత్వ నిర్ణయం 'నీట్' విద్యార్థులకు శాపంలా మారిందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తున్న టీడీపీ కూటమి ప్రభుత్వ విధానం ఏరు దాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందన్నారు. రాష్ట్రంలో వైద్య విద్యను పేద విద్యార్థులకు కూడా చేరువ చేసేందుకు రాష్ట్ర చరిత్రలో గతంలో ఏనాడూ లేని విధంగా గత ప్రభుత్వ హయాంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఒకేసారి 17 మెడికల్ కాలేజీలకు అనుమతులు సాధించి నిర్మాణం చేపట్టారని మాజీ ఎమ్మెల్యే సత్తి తెలిపారు. ఫలితంగా 2023-24లో విజయనగరం, మచిలీపట్నం, రాజమండ్రి, ఏలూరు, నంద్యాల వైద్య కళాశాలలు ప్రారంభమై ఒకేసారి 750 మెడికల్ సీట్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. కూటమి ప్రభుత్వ నిర్వాకంతో ఈ ఏడాది 700 ఎంబీబీఎస్ సీట్లు రాకుండా పోయాయని మాజీ ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు.కొత్త మెడి కల్ కాలేజీలు ప్రారంభమైతే నీట్ విద్యార్థులకు మేలు జరిగితే ఎక్కడ జగన్‌కు పేరొస్తుందో అన్న దుర్బుద్ధితో చంద్రబాబు ప్రభు త్వం నాటకమాడుతుందని ఆయన ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల ఈ ఏడాది 700 మంది విద్యా ర్థులు, వచ్చే ఏడాది 1750 మంది విద్యార్థులు వైద్య విద్య అవకాశాన్ని కోల్పోయారని ఆయన ఆరో పించారు. సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, సత్తి రామ కృష్ణారెడ్డి (రాంబాబు), సర్పంచ్ వారా కుమారి పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు సన్నాహాలు

విశాలాంధ్ర – రాజానగరం : విద్యార్థుల్లో క్రీడాతత్త్వం పెంచేందుకు ఈ నెల 18 నుంచి మూడు రోజులు పాటు స్కూల్ గేమ్ ఫెడరేషన్ పేరిట మండల స్థాయి క్రీడా టోర్నమెంట్ , సెలక్షన్స్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారులు -1,2 ఎం. రామన్న దొర,గుబ్బల జ్యోతి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మండల విద్యాశాఖాధికారులు మాట్లాడుతూ సెప్టెంబర్ 18 నుండి 20వ తేది వరకు మూడు రోజులు పాటు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్ గేమ్స్, క్రీడలకి సంబంధించి అండర్ 14 ఇయర్స్, అండర్ 17 ఇయర్స్ బాలుర, బాలికలకు టోర్నమెంట్ కం సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. క్రీడల్లో భాగంగా వాలీ బాల్, కోకో, షటిల్, బ్యాడ్మింటన్,చదరంగం,యోగకి సంబంధించి మండలంలోనీ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. మండల స్థాయి స్కూల్ గేమ్ కన్వీనర్లుగా ఎంఈవో-1 ఎం. రామన్న దొర,ఎంఈవో -2 గుబ్బల జ్యోతి ప్రసాద్ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

రేపు నేషనల్ డీవార్మింగ్ డే

విశాలాంధ్ర - తూర్పుగోదావరి : ప్రభుత్వం నిర్వహిస్తున్న నేషనల్ డీవార్మింగ్ డేలో భాగంగా ప్రతి పిల్లలకు అంగన్వాడి, స్కూల్, కాలేజ్‌లలో తప్పని సరిగా ఆల్బెండజోల్ మాత్రను మింగించడం జరుగుతుందని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని శాఖల సహకారంతో నేషనల్ డీవార్మింగ్ డేకి తగిన ఏర్పాట్లను చేశామన్నారు. సెప్టెంబర్ 17 వ తారఖున జరగబోయే నులిపురుగుల నివారణ దినోత్సవానికి తూర్పుగోదావరి జిల్లాలో 3400 ఇన్స్టిట్యూషన్స్ (అంగన్వాడి , ప్రభుత్వ పాఠశాల , ప్రైవేటు పాఠశాల , ప్రభుత్వ కళాశాల , ప్రైవేటు కళాశాల , ఇంజినీరింగ్ కాలేజీలు మొదలగు) లలో ఏర్పాట్లు చేశామని, జిల్లాలో మొత్తంగా 1 నుండి 19 సంవత్సరాల పిల్లలు 4,30,339 ఉన్నారని వారందరికీ ఆల్బెండజోల్ మాత్ర వేస్తామని, ప్రతి తల్లితండ్రులు వారి పిల్లలను తప్పనిసరిగా స్కూల్, కాలేజీలకు పంపించాలని స్కూల్ , కాలేజీలలో చేరని వారికి వారి అంగన్వాడీ సెంటర్ ల లో ఈ మాత్ర ఇస్తారని జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిశ్చంద్ర తెలిపారు.

పోటా పోటీగా గణపతి లడ్డు పాట

విశాలాంధ్ర - సీతానగరం: గణపతి లడ్డు పాటకి పోటా పోటీ. మండలంలో గణపతి నవరాత్రులు ముగియడంతో అన్ని వినాయక విగ్రహాల వద్ద ఉన్న లడ్డు ప్రసాదం కోసం భక్తులు పోటా పోటీ పడ్డారు. దీనిలో భాగంగా కొన్ని దశాబ్దాల చరిత్ర కలిగిన రఘుదేవపురం చెరువు వద్ద గల వినాయకుని గుడి వద్ద గల 33వ గణపతి నవరాత్రులు స్వామి వారి లడ్డు ప్రసాదం కోసం సోమవారం జరిగిన పాటలో నిడదవోలు చక్రధరరావు లడ్డూను 41వేల రూపాయలకు చేజిక్కించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ లడ్డు ప్రసాదం మాకు దక్కడం చాలా సంతోష కర విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో చుండ్రు సత్య ప్రసాద్, నిడదవోలు శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఉత్సవ కార్యక్రమాలు

విశాలాంధ్ర - పెరవలి : మండలంలోని పలు గ్రామాలలో వినాయక ఉత్సవాలలో భాగంగా సోమవారం మల్లేశ్వరం గ్రామంలో నెలకొన్న వినాయకుడు వశిష్ట గోదావరిలో నిమజ్జనానికి బ్యాండ్ మేళాలు, భాజా భజంత్రీలు కోలాటాల మధ్య తరలి వెళ్లాడు. ఉత్సవాలలో పాల్గొన్న శాసనమండలి సభ్యులు వంక రవీంద్రనాథ్‌ను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. చాలా గ్రామాలకు భిన్నంగా మల్లేశ్వరం గ్రామంలో ఒకే వినాయక మండపం ప్రతిష్టించి అందరూ పూజలు చేస్తుంటారు. తీపర్రు గ్రామంలో వినాయకుని ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వినాయకుడిని ఊరేగించే వాహనాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈఅలంకరణ చూపరులను ఆకట్టుకుంది. పలు గ్రామాలలో అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు.

అట్టహాసంగా గణేష్ నిమజ్జనం

విశాలాంధ్ర - గండేపల్లి : మండలంలోని మల్లేపల్లి కొత్తూరులో గణేష్ నవ రాత్రుల్లో భాగంగా బాల గణపతికి తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిపించారు. మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఉండమట్ల వెంకటేశులు వేలంపాటలో లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్య క్రమంలో నరవ శ్రీనివాస్, వినయ్, ఉండమట్ల త్రిమూర్తులు, కామరాజు, శ్రీను, బాల గణేష్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు విస్తృతం చేయాలి

విశాలాంధ్ర - దేవరపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు మరింత విస్తృత పరచవలసిన అవశ్యకత ఎంతైనా ఉందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు . దేవరపల్లి మండలం ఎర్రగుడెంలో శివారు ఆర్ కన్వెన్షన్ హాల్లో టిడిపి నాయకుడు పెనుమత్స సుబ్బరాజు జన్మదిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య రక్తదాన శిబిరంను ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం లో ప్రముఖ తెలుగు దేశం నాయకుడు పెనుమత్స సుబ్బరాజు జన్మదిన సందర్భంగా ఎర్రగూడెం శివారు సూర్యనారాయణ పురం వద్ద ఆర్ కన్వెన్షన్ హాల్ లో భారీ స్థాయిలో ఉచిత మెగా వైద్యశిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన పెన్మత్స సుబ్బరాజును అభినందించారు. సుబ్బరాజు సేవా కార్యక్రమాల్లో ముందుంటూ గోపాలపురం నియోజకవర్గంలోని అంబులెన్స్ కూడా సొంత నిధులతో ఏర్పాటు చేశారని, అలాగే జన్మదిన పురస్కరించుకొని ఇటువంటి మెడికల్ క్యాంపులు పెట్టడం ఎంతో అభినందనీయమని అన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో సూపర్

స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వచ్చి ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే మద్దిపాటి అన్నారు. తమ నియోజకవర్గంలో ప్రతి మండలం లో ప్రతి మూడు నెలలకు ఒకసారి మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. దీనికి నాయకులు కార్యకర్తలు సహకారంతో ముందుకు సాగుతామని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 16 మంది ప్రముఖ డాక్టర్లు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి రోగులకు ఉచితంగా మందులు అందిస్తారని అన్నారు. గుండె ఊపిరితిత్తులు బీపీ షుగర్ దంతా వంటి వాటిని పరీక్షించి రోగులకు మందులు ఉచితంగా అందించటం గొప్ప విషయం అన్నారు . ఈ సందర్భంగా యువకులు 20 మంది రక్తదానం ఇచ్చారు ఎన్టీఆర్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రక్తం దాన శిబిరంలో వైద్య సేవలు అందించాలని తెలిపారు . రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మం డల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ , మండల గోపాలపురం నల్లజర్ల ద్వారకాతిరుమల, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, తాతిని సత్యనారాయణ, లంక సత్యనారాయణ, సీనియర్ తెలుగుదేశం నేతలు కోయిలమూడి చిన బాబు, ఆచంట శేషారావు, కంచిపూడి సుబ్బారావు, ముమ్మిడి సత్యనారాయణ, ముళ్ళపూడి దొరజి చౌదరి, యద్దనపూడి బ్రహ్మ రాజు, బిక్కిన నాగ రాజు, ఉప్పులూరి రామారావు , బల్ల సూర్యచక్రం, కూచిపూడి చక్రవర్తి, యాగంటి వెంకటేశ్వరరావు, గద్దె శ్రీనివాస్, కృష్ణ పాలెం సర్పంచ్ నాయుడు, దుర్గాప్రసాద్, నూతంగి దొర బాబు, పాతూరి గిరిధర్, జనసేన నేతలు సత్తిబాబు, సూరిశెట్టి బాలు, జాజిమొగ్గ శ్రీనివాస్, మానవతా సంస్థ సభ్యులు సత్యనారాయణ, ఈదుపుగంటి నాగేశ్వర రావు, సూర్యప్రకాశరావు, గోపాలపురం నియోజక వర్గం లో టీడీపీ, జనసేన, బిజెపి నేతలు పాల్గొన్నారు

'నాట్యశిల్పారామం' ప్రారంభం

విశాలాంధ్ర- కూచిపూడి : కూచిపూడి నాట్యాచార్యులు, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, లెజెండ్, కళారత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాంనాట్య క్షేత్రమైన కూచిపూడి అగ్రహారంలోని తన ఇంటి వద్ద 'కూచి పూడి నాట్య శిల్పారామం'ను నెలకొల్పారు. ఆయన శిష్యప్రశిష్యులు సోమవారం నాట్యాంశాలు ప్రదర్శించారు. కూచిపూడి నాట్య శిల్పారామం సంస్థను ప్రభుత్వ జూనియర్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు వేదాంతం వెంకట శివయ్య, కళా పీఠం విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ వేదాంతం రామలింగ శాస్త్రి, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు అగ్నిహోత్రం హయగ్రీవ రామాచా ర్యులు సోదరులు చేసిన ప్రారంభోపన్యాసం తో శ్రీకారం చుట్టారు. నాట్యా చార్య ఏలేశ్వరపు వెంక టేశ్వర్లు(కూచిపూడి), నాట్య రవళి పసుమర్తి (శ్రీవల్లి (కైకలూరు) బృందం, త్రిపుర (నెల్లూరు) బృందం, శ్రీ లీల (గుడివాడ) బృందం ప్రదర్శించిన అంశాలు మైమరిపింప చేశాయి.

పుష్ప సురేష్ శర్మకు సన్మానం

విశాలాంధ్ర - ఆమలాపురం : సినీ నటులు ప్రముఖ పురోహి తులు పుష్పసురేష్ శర్మను గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుగణేష్ ఉత్సవ కమిటీల సభ్యులు ఘనంగా సత్కరించారు. జూబ్లీహిల్స్ ప్రశాషనగర్ ఉత్సవ కమిటీ సభ్యులు గణేష్ నిమజ్జనం వేడుకలు పురస్కరించుకొని కళారంగానికి హైందవ సమాజానికి సురేష్ శర్మ చేస్తున్న సేవలను కొనియాడుతూ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సత్కరించి అభినందించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావనలు పెంపొందించే దుకు, ఐకమత్యాన్ని తీసుకొచ్చేందుకు గణేష్ ఉత్సవాలు దోహదపడతాయని, గణనాథుని దయతో సమాజహితం అందరూ పెంపొందించుకోవాలని సురేష్ శర్మకోరారు. ఈకార్యక్రమంలో ప్రశాషన్ నగర్ ఉత్సవ కమిటి అధ్యక్షులు కమిడి గంగరాజు , సాయి, బన్నీ, మణి , మహేష్ , అప్పారావు , రవికుమార్ , లక్ష్మి పాల్గొన్నారు.

వాస్తవ పరిస్థితులు తెలుసుకుని మాట్లాడాలి

విశాలాంధ్ర - కాకినాడ : వాస్తవ పరిస్థితులు చూసి మాట్లాడాలని గ్రామస్తులు, సర్పంచ్ కోరారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వికేరాయపురం గ్రామంలో ఈ సెప్టెంబర్ నెల 8వ తారీఖున వరదలు తీవ్రత ఎక్కువ ఉండడంతో వికేరాయపురం గ్రామంలో ఉన్న వెస్ట్ ఏలేరులోడ గండిపడే పరిస్థితి ఏర్పడడం వల్ల దిగువ నున్న గ్రామాలు వీకే రాయపురం, బోయినపూడి, మాధవపట్నం తదితర గ్రామాలు ముంపునకు గురి కాకుండా పెద్దాపురం నియోజకవర్గ శాసనసభ్యులు నిమ్మకాయల చిన రాజప్ప, నిమ్మకాయల రంగనాగ్ పర్యవేక్షణలో ఆదేశాలతో ప్రభుత్వ యంత్రాంగం, అధికారులు త్వరగతిన గట్టు గండిపడకుండా దిగువ గ్రామాలకు ఇబ్బంది ఏర్పడకుండా ముంపునకు గురికాకుండా గట్టును పటిష్ట పరచడానికి కావాల్సిన ఇసుక బస్తాలు, ఇతరత్రా మెటీరియల్ అంతా సమకూర్చి అధికారి యంత్రాంగం, గ్రామ సర్పంచ్ , గ్రామ ప్రజలు పర్యవేక్షణలో రాత్రికి రాత్రి గట్టును పటిష్టపరిచే పనులు ప్రారంభించి ఈ నెల సెప్టెంబర్ 8, 9, 10వ తారీకు వరకు యుద్ధ ప్రాతిపదిన పనులను పూర్తి చేశారు. తరువాత మరల రాత్రి అధిక మొత్తంలో క్యూసెక్కుల నీరు ఏలేరు నుండి విడుదల చేయడంతో వరద నీరు అధికంగా ప్రవహించడంతో గట్టు ముంపునకు గురికాకుండా, గండి ఏర్పడకుండా చేసిన ఏర్పాట్లు అతి స్వల్పంగా కొంత మేర దెబ్బతిన్నది. మరుసటి రోజు నుండి నీటి ప్రవాహం తగ్గడంతో మా గ్రామానికి, కింద ఉన్న గ్రామాలకు ప్రమాదాం తప్పింది. సాంక్షన్ అయిన నిధుల్ని, మెటీరియల్‌ని పక్కదారికి మళ్ళించారని, ఈ గట్టు పనులు పటిష్టంగా పూర్తి చేయకుండా అసంపూర్తిగా పనులు చేసి నిలిపివేసి మెటీరియల్‌ని దారి మళ్ళించారని, అసత్య ప్రచారం చేస్తున్న కొన్ని యూట్యూబ్ ఛానలు...కొందరు వ్యక్తులు అసత్య ఆరోపణలు చేయడం అది పూర్తిగా అవాస్తవమని గ్రామ సర్పంచ్ సర్వేశ్వరావు, ,కుర్ర నారాయణ స్వామి, గ్రామ ప్రజలు ఖండిస్తూ.. వాస్తవ పరిస్థితులు చూసి తెలుసుకొని మాట్లాడాలని..తప్పుడు ఆరోపణలు చేయడం తగదని..గండి పడకుండా గట్టుకు శాశ్వత పరిష్కారం చూపించాలని జిల్లా కలెక్టర్ వారిని గ్రామ సర్పంచ్ , గ్రామస్తులు కలిసి వినతి పత్రం ఇచ్చారని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి త్వరలో వీకే రాయపురం గ్రామానికి విచ్చేసి ప్రస్తుతం ఉన్న కాలవ గట్టును సందర్శించి భవిష్యత్తులో ఎటువంటి విపత్తు సంభవించకుండా పూర్తిస్థాయిలో ఆ గట్టును పటిష్టపరిచే విధంగా శాశ్వత పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం గ్రామంలో ఎటువంటి ముంపునకు గురి కాలేదని ముంపుకు గురు కాకుండా గ్రావెల్ , మట్టితో గట్టును పటిష్టపరిచి ప్రతి రోజు పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకోంటున్నట్లు గ్రామ సర్పంచ్ , ఎక్స్ సర్పంచ్, గ్రామస్తులు ఆ గట్టు వద్దకు చేరుకుని ప్రస్తుత పరిస్థితిని, చూపిదిచి వివరించారు. గండి పడకుండా గట్టును పట్టిష్టపరిచినందుకు కావలసిన జాగ్రత్తలు తీసుకుని సహాయక చర్యలు చేసినందున గ్రామానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా భద్రత చర్యలు చేపట్టినందున జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాంగం, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పెషల్ సెక్రటరీ ఐఏఎస్ కృష్ణ తేజ ట్విట్టర్లో అభినందించారు. త్వరలో జిల్లా కలెక్టర్ గ్రామానికి విచ్చేసి గట్టుకు శాశ్వత పరిష్కారం కూడా చూపుతానని సర్పంచ్‌కి, ఎక్స్ సర్పంచుకు, గ్రామస్తులకు హామీ ఇచ్చారని, వాస్తవ పరిస్థితులు చూసి మాట్లాడాలని గ్రామస్తులు, సర్పంచ్ కోరారు.

రైతులకు నష్టపరిహారం ఇప్పించాలి

విశాలాంధ్ర - అవనిగడ్డ : ఐదు సొసైటీల పరిధిలో 250 ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం ఇప్పించాలని ఐదు సొసైటీలకు చెందిన రైతులు సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. పులిగడ్డ 5 సొసైటీలకు చెందిన రైతులు మండలిని కలిసి బుద్ధప్రసాద్ ద్వారా సమస్యను ఆర్.డి.ఓ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ కార్యక్రమంలో పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-నందిగామ: పట్టణం మధిర ఆర్చి రోడ్ తాళ్లూరి ఫిల్లింగ్ స్టేషన్‌లో తాళ్లూరి ట్రస్ట్ వరద బాధితుల సహాయార్థం 100 మందికి సోమవారం ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దుప్పట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితుల సహా యార్థం ముందుకు రావడం హర్షనీయం అన్నారు. బాధితుల సహాయార్థం మనం అందిస్తున్న సహాయం ప్రతివారికి స్ఫూర్తిదాయ కంగా నిలవాలని ఈ సందర్భంగా తంగిరాల సౌమ్య తెలిపారు.

ప్రపంచ శాంతి, సమాజం కోసం మహ్మద్ ప్రవక్త కృషి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రపంచ మానవళి శాంతి కోసం ఇస్లాం మార్గ దర్శి మహ్మద్ ప్రవక్త తన జీవితాన్ని అంకితం చేశారని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు షేక్ జలీల్ తెలిపారు. సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మిలాద్ ఉన్ నబీ వేడుకలను నవరంగ్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు అధ్వర్యంలో దైవప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సయ్యద్ సైదా, రామారావు, షేక్.మస్తాన్ వలి, షేక్. కరీముల్లా, పార్టీ సభ్యులు గబ్బర్, మీరా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మొత్తం డ్రైయిన్లను ప్రక్షాళన చేస్తాం

విశాలాంధ్ర - అవనిగడ్డ : పంచాయితీ పరిధిలోని మురుగు డ్రైయిన్‌లు మొత్తం ప్రక్షాళన చేస్తామని పంచాయితీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు అన్నారు. శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఆదేశాల మేరకు ఈఓపిఆర్‌డి కమ్మిలి సుందరి ఆధ్వర్యంలో సోమవారం 3,5 వార్డులతో పాటు సీతాయలంక లోని కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలోని పూడికను పూర్తి స్థాయిలో తొలగించి మురుగు నీరు సక్రమంగా పారుదల అయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇదేవిధంగా పంచాయితీ పరిధిలోని అన్నీ మురుగు డ్రైనేజీలలో పూడిక తీత పనులు చేయడం జరుగుతుందని అత్యవసరం అయితే ఆ యా వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే డ్రైనేజీలోని పూడిక తీసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

వెళ్లి రావయ్యా మాబొజ్జ గణపయప్ప

ఘనంగా గణేష్ నిమజ్జనాలు

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా జిల్లా కపిలేశ్వరపురం మండలం పరిధిలోని టేకి కపిలేశ్వరపురం, అంగర, మాచర తదితర గ్రామాలలో గణేష్ విగ్రహాలను తీన్మార్ వాయిద్యాలతో, బాణా సంచా కాల్పులతో గ్రామ వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి, అనంతరం గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. కోరుమిల్లి గ్రామంలో వినాయక చవితి సందర్భంగా గణపతి మండపాలలో ప్రతిష్టించిన గణనాథుని విగ్రహాలను తొమ్మిది రోజుల విశేష పూజలు అనంతరం వాహనాలపై శోభా యాత్రగా యువకులు ఒకరి పై ఒకరు రంగులు జల్లు కుంటూ, ఉత్సాహంగా వెంట రాగా గోదావరి నదిలో నిమజ్జనం చేశారు. సోమవారం ప్రభుత్వ శలవు దినం కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జన ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు పులిహోర, మంచి నీళ్ళు ప్యాకెట్లు అందచేశారు. అంగర పోలీస్‌లు గణేష్ నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోదావరి నదీ రేవుల వద్ద బందోబస్తు నిర్వహించారు. కపిలేశ్వరపురం గ్రామ ప్రభుత్వ హాస్పటల్ వైద్య సిబ్బంది మెడికల్ క్యాంప్ నిర్వహించారు. నిమజ్జనం రేవులు వద్ద విఆర్‌వోలు,కపిలేశ్వరపురం పంచాయితీ కార్యదర్శి శివ చక్రవర్తి, గ్రామ మహిళా పోలీసులు, విఆర్ఏలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - సామర్లకోట : గణపతి బప్పా మోరియా, బై బై గణేశా అంటూ సామర్లకోట పట్టణము మరియు పరిసర ప్రాంతాల యువకులు, మహిళలు పెద్ద ఎత్తున

గణేష్ నిమజ్జనం వేడుకలలో పాల్గొన్నారు. గణపతి నవరాత్రులు పురస్కరించుకుని తొమ్మిది రోజులు పూజలు అందుకుని సోమవారం గణేశునికి నిమజ్జన వేడుకలను నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో యువకులు, మహిళలు ఉత్సాహంగా దాన్సులతో గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ సామర్లకోట గోదావరి కాలవ వద్ద నిమజ్జనం వేడుకలను నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సామర్లకోట పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గజ ఈత గాళ్లను ఏర్పాటు చేసి నది స్నానం చేసే వారికి రక్షణ ఏర్పాట్లు చేశారు.

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలో పలు చోట్ల గణేష్ నిమజ్జనాలతో సందడి చోటు చేసుకుంది. జగ్గంపేట మండలంలోని వివిధ గ్రామాల్లోని ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయకునికి నవరాత్రి పూజలు పూర్తి కావడంతో సోమవారం నిమజ్జన కార్యక్రమాలు చేశారు. యువత తీన్మార్ డప్పులతో, మ్యూజిక్‌తో గణేష్ నిమజ్జనాలు చేసేందుకు పుష్కర, పోలవరం కాలువలు వద్దకు చేరుకున్నారు. మండల కేంద్రమైన జగ్గంపేట పుష్కర కాలువ వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు

పలు చోట్ల అన్న సంతర్పణలు

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలోని పలు చోట్ల సోమవారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకుని స్థానిక జగనన్న కాలనిలో రామవరం లే అవుట్‌లో ఏర్పాటు చేసిన వినాయక పందిరి వద్ద అన్నదానం చేశారు. అదే విధంగా టాక్సీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని రామవరం గ్రామంలో ఉన్న జగ్గంపేట లారీ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం జరగడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ అధ్యక్షులు ధవులూరి ఈశ్వరరావు, మారిశెట్టి భద్రం, తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి, పెదపూడి :

స్వయంభుగా వెలసిన విఘ్నాధిపతి బిక్కవోలు శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి మహోత్సవాలు 9 రోజులపాటు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతుల ఆర్థిక సహాయంతో సోమవారం నిర్వహించిన అన్నసమారాధనలో సుమారు 15 వేల మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి కొద్దిసేపు భక్తులకు స్వయంగా వడ్డించారు. నవరాత్రులు ముగియడంతో నియోజవర్గ వ్యాప్తంగా ఇంకా పలుచోట్ల అన్న సమారాధనా కార్యక్రమాలు, గణేశుని నిమజ్జనాలు పెద్ద ఎత్తున కొనసాగాయి. డప్పు, వాయిద్యాలు, బ్యాండ్ మేళాలు, బాణసంచా కాల్పులు, భక్తుల డాన్సులతో గణపతి బప్పా మోరియా అంటూ ఉత్సాహంగా వినాయకుని నిమజ్జనాలు జరిగాయి.

గండేపల్లి మండలం, ఉప్పలపాడులో భారీ :

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం ఉప్పలపాడులో గణపతి నవరాత్రుల్లో భాగంగా సోమవారం లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఉప్పలపాడు జనసేన పార్టీ నాయకులు మేడి బోయిన శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట జనసేన పార్టీ ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ గణపతి ఆలయం వద్ద తొమ్మిది రోజులు ప్రత్యేక పూజలు జరిపించి, లక్ష్మీ గణపతి కరుణ కటాక్షాలను పొందడం, భారీ అన్న సమారాధన చేయడం చాలా సంతోషకర మన్నారు. ఈ కార్యక్రమంలో సత్తి సోమరాజు, మేడిపోయిన శివరామ కృష్ణ, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు. ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ వేడుకలు

విశాలాంధ్ర - గుడివాడ : అల్లా దయ కరుణ, కృపతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. సోమవారం మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో బంటుమిల్లి రోడ్డులోని షాహీ మసీదులో జరుగుతున్న మిలాద్ ఉన్ నబీ ప్రార్థనల్లో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు సందర్భంగా ముస్లిం సోదరులందరూ ఎంతో సంతోషంగా వేడుకలు నిర్వహించుకోవడం ఆనందదాయకమన్నారు. అల్లా దయ్యతో ప్రజలందరూ సుఖసంతోషాలతో సుభిక్షంగా ఉండాలన్నారు. ఈ వేడుకల్లో మత గురువులు మెహబూబ్ బేగ్, మసీదు కమిటీ సభ్యులు గాంధీ, రషీద్‌బేగ్, ఖాజా, మొహిద్దీన్, షరీఫ్, సలీం, కరిముల్ల, మోబీన్, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, మైనార్టీ పెద్దలు షేక్ ఇబ్రహీం, షేక్ సర్కార్, సయ్యద్ జాబిన్, మహమ్మద్ రఫీ, షేక్ ముజాహిద్, టిడిపి నాయకులు డా॥ గోర్జి సత్యనారాయణ, పెద్ది శ్రీకాంత్, మైనార్టీ పెద్దలు పాల్గొన్నారు.

మల్లిఖార్జున చార్యులు సేవలు ఆదర్శనీయం

ఏలూరు జిల్లా సీపీఐ కార్యదర్శి కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - జంగారెడ్డిగూడెం: ఉపాధ్యాయ, ఉద్యమ నాయకులు గొల్లపల్లి మల్లికార్జునచార్యులు సేవలు ఆదర్శనీయమని సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. మండలంలోని లక్కవరం గ్రామంలో మల్లికార్జునచార్యులు జయంతి సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ మెట్ట ప్రాం తంలో సీపీఐ ఆశయాలకు అను గుణంగా పనిచేసి ఉపాధ్యాయ, ఉద్య మాలను ముందుకు నడిపించిన మహనీ యుడు మల్లికార్జున చార్యులు అని కొని యాడారు. మల్లికార్జున చార్యులు సిపిఐ పట్ల అంకిత భావంతో పనిచేయటంతో పాటు పారదర్శకంగా ఉండే నాయకులు అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి గౌర వాధ్యక్షులు, సీనియర్ బుర్రకథ కళాకారులు, జూని యర్ నాజర్ బిరుదాంకితులు సబ్బి కనకారావును

శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్ర మంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావు,జిల్లా కౌన్సిల్ సభ్యులు టీవీ ఎస్ రాజు, బి కే ఎం యు జిల్లా ఉపాధ్యక్షులు గోలి మే బాల యేసు,ప్రముఖ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, ఎల్ఆర్ కృష్ణబాబు, ఉపాధ్యా యులు లీలాకుమార్, సీతారామాంజనేయులు, ఫకీర్, సోషల్ వర్కర్ వీరమల్ల మధు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలన్నీ అమలు : ఎంపీ పుట్టా

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : ఎన్నికల సమయంలో చేసిన ఆరు వాగ్దానాలలో ఐదు అమలు చేశామని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ చెప్పారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజులైన సందర్భంగా ఏలూరు ఎంపీ క్యాంపు కార్యా లయంలో మీడియాతో మాట్లాడుతూ వర్జీనియా పొగాకు రైతులకు రూ.110 కోట్ల లబ్ధితో పాటు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 12వేల 500 కోట్లు నిధులు సాధించామన్నారు . ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు వందే భారత్ ఎక్స్ ప్రెస్‌కు ఏలూరులో నిలుపుదల చేసేలా రైల్వే శాఖ ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఏలూరులో జాబ్‌మేళా నిర్వహించి 566 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందిం చామని తెలిపారు. పామాయిల్ దిగుమతులపై 27.5శాతం సుంకం విధింపు ద్వారా పామాయిల్ రైతులకు టన్నుకు ధర సుమారు రూ. 16వేల 500తో పాటుగా దేశవ్యాప్తంగా వంటనూనె గిం జలు పండించే రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామన్నారు. పామాయిల్ రైతు సంఘాల నాయ కులు ఆచంట సూర్య నారాయణ, బొబ్బా వీర రాఘవ రావు, ఉండవల్లి వెంకట్రావు, వంకినేని రామరాజు క్రాంతికుమార్ రెడ్డి, పెనుమత్స రామ రాజు, టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాం జనేయులు, చింతలపూడి శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక పుష్కరోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ : శ్రీ లక్ష్మీగణపతి సుబ్రహ్మణ్యేశ్వర సాయిబాబా మందిరం, శ్రీ అభయాంజనేయ స్వామివార్ల ఆలయప్రాంగణంలో గణపతి ఆలయ ప్రతిష్టించి పుష్కరవార్షికోత్సవాలు ఆలయకమిటీ చైర్మన్ కడియాల సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఇంద్రపాలం బ్రాహ్మణ అగ్రహారంలో కడి యాల దంపతులచే గణపతి హెూమం, భక్తులచే విఘ్నేశ్వర ప్రతిమలకు సహస్ర గరికపూజలు, విశేషపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా అన్నప్రసా దం వితరణ భారీస్దాయిలో చేసారు. స్దానిక ఇంద్రపాలెం మూడు గుళ్ళు కమిటీ హాల్ వద్ద బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘం ప్రతినిధి బృంద సభ్యులు సంఘ వ్యవస్దాపక అధ్యక్షులు పసుమర్తి సత్య నారా యణ మూరి స్వామివారిని దర్శించుకుని గణపతి హెూమం పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గోన్నారు. సంఘ ముఖ్య సలహా దారులు నాగ మహాశయ, కవికొండల భీమ శంకరం, గౌరవ అధ్యక్షులు తనికెళ్ళ రాంబాబు, గరి మెళ్ళ లక్ష్మీనారాయణ శర్మ, నాగదేవర లక్ష్మీనారాయణ శర్మ, ప్రచార కార్యదర్శి డా పరశురామ్, కార్యవర్గ సభ్యులు లక్ష్మీనారాయణ, జి విష్ణుభోట్ల సత్య నారాయణ, గుండు శ్రీనివాస్, చల్ల రామ య్య, రాంజీ, పురోహితులు తంగిరాల శివ రామకృష్ణ, గునుపూడి శ్రీనివాస్ పలువురు పాల్గో న్నారు. చైర్మన్ కడియాల సత్య నారాయణమూర్తి మాట్లాడుతూ గణపతి ఆలయం ప్రతిష్టించి 12 సంవత్సరాలు పూర్తిఅయిన సందర్భంగా బ్రాహ్మణ అభివృద్ధి సమాఖ్య సేవా సంఘానికి ఉపాధ్య క్షులుగా నిర్వహిస్తున్నానని వారి సహకారాలతో పూజాకార్యక్రమాలను విశేషంగా జరిపామన్నారు.

రాంజీ ప్రసాద్‌కు సత్కారం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : ఏపీసీఆర్పి డబ్ల్యూఏ కాకినాడ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసిన సందర్భంగా రాష్ట్రంలో నూతనంగా పదవీ బాధ్య తలు తీసుకున్న రాష్ట్ర అధ్యక్షుడు ఎలిపే రాంజీ ప్రసాద్, రాష్ట్ర భరోసా కన్వీనర్ అరిగెల రాజేంద్ర కుమార్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబెర్ బొట్ట భరత్ కుమార్‌కు కాకినాడ జిల్లా సీఆర్పీలు ఘనంగా సన్మానించారు. అనంతరం కాకినాడ జిల్లా నూతన అధ్యక్షుడుగా తరాల మీరాసాహెబ్ ప్రధాన కార్యదర్శిగా పలక రాజు కోశాధికారిగా మెడిబోయిన నాగలక్ష్మి, కాకినాడ అర్బన్ అధ్యక్షులుగా స్వర్ణ సుధ సుమారు 18 మంది కాకినాడ రూరల్ సీఆర్పిలను ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

సేవా పక్షోత్సవాలు, సభ్యత్వ నమోదుపై అవగాహన

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం యూజేపురం గ్రామంలో బిజెపి సభ్యత్వ నమోదు అలాగే సేవ పక్షోత్సవాలు, ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు గురించి చర్చించారు. ఈ కార్యక్రమం గ్రామ బిజెపి నాయకులు మేడసాని సత్యనారాయణ, గొర్లె చంటబ్బాయి ఆధ్వ ర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు సేవాపక్షోత్సవాలు అలాగే రోజుకు ఒక కార్యక్రమం నిర్వహిస్తామని కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17, 18, 19 తేదీలలో రక్తదాన శిబిరాలు, గ్రామాలలో వైద్య శిబిరాలు, పాఠశాల, వైద్య శాలలో స్వచ్ఛత కార్యక్రమాలు మరియు స్వతంత్ర సమర యోధులు విగ్రహాలు శుభ్రం చేయుట, ఎక్స్ సర్వీస్మెలను సన్మానించడం, అలాగే ఖాదీ ఉత్పత్తులు కొనుగోలు, మొక్కలు నాటడం, శక్తి కేంద్ర ప్రము ఖులతో బూత్ స్థాయిలో పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయకి పుష్పాంజలి వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మండలం బిజెపి ఉపాధ్యక్షులు ఊట వీరబాబు, ఏలేశ్వరం రూరల్ అధ్యక్షులు కూరాకుల రాజా, బాలిపల్లి చక్రి తదితరులు పాల్గొన్నారు.

గణపతి పూజలతో సమైక్యత పెరుగుతుంది

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక ఆర్ఆర్ నగర్‌లో వినా యక చవితి నవరాత్రి మహెూ త్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. కాలనీ భక్త బృందం ఎన్నడు లేని విధంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నవ రాత్రి ముగింపు సందర్భంగా ప్రసాద వితరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కన్నుల పండుగ జరిపించారు. చివరి రోజున సోమవారం రోజున అన్న ప్రసా దాన్ని స్వీకరించడానికి నగరంలో ఉన్న ప్రముఖులు విచ్చేసి స్వామివారి దర్శించుకోవడం గొప్ప విషయం. ఈ సందర్భంగా మండలిక వెంకట శాస్త్రి మాట్లాడుతూ గత 19 సంవత్సరాలుగా ఆర్ఆర్ నగర్‌లో భక్తులు అందరి సహ కారంతో విశేషంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ వచ్చామ న్నారు. కాలనీవాసులందరూ కలిసిమెలసి ఈ పండుగ జరుపుకోవడం ద్వారా సమైక్యత భావాన్ని చాటుకున్నారని అన్నారు. ప్రతిరోజు విశేష పూజలు నిర్వ హించడమే కాక భజనలు, సామూహిక కుంకుమ పూజలు, గాన కచేరీలు ఏర్పాటు చేసి హిందూ వాదానికి మరింతగా సంఘటితంగా గణపతి ఉత్స వాన్ని పూర్తి చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవి ఫణి ప్రసాద్ బాబు, జాగీర్దార్ ప్రేమ్ కుమార్, ఎంవి కృష్ణారావు, డి అనూష, భగవాన్, రోటరీ గ్రీన్ సిటీ అధ్యక్షులు కందాల రవి, లయన్స్ ఎలైట్ అధ్యక్షులు మైలవరపు సత్య నారాయణ, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వర రావు, సాయిశర్మ, జివిఆర్ శర్మ, చిట్టిరాజు, వెంకట్ పలువురు పాల్గొన్నారు.

స్వామివారి లడ్డు వేలం పాట

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం మండల పరిధిలోని వరగల్లంక గ్రామంలో వినాయక నవరాత్రులు సందర్భంగా ఏర్పాటు చేసిన 54 కేజీ లడ్డూకు సోమవారం వేలంపాట నిర్వహించగా రామాయణం వెంకటేశ్వరరావు అనే భక్తుడు 54 కేజీల లడ్డును స్వామివారికి సమర్పించగా సోమవారం వేలం పాట నిర్వహించారు. ఈలడ్డును కోలా లక్ష్మణస్వామి రూ.30వేలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామాయణ బాబురావు, రామాయణం మహేశ్వరరావు, నూకల మణి, నూకల రాము, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.